# సన్మానం

## ● పుష్పనూతుల నరసింహా రెడ్డి

తారు రోడ్డుపై కారు కొండెగ సాగిపోతోంది.

రాజారావు కారు వెనుక సీట్లో మెడ క్రింద రెండు చిన్న దిండ్లు ఆనరాగ కూర్చున్నాడు. అతనికి థయ్‌రాడ్ వ్యాధి... మెడలు ఏ ఆధారం లేకుండా వుంటే వెంటనే విపరీతమైన మెడనొప్పి... దీనికి తోడు బి.పి. వుంది. అవును మరి. అరవై ఏళ్ళు దాటితే అన్నీ సమస్యలే కదా!

రాజారావు కళ్ళను మూసుకుంటూ వెనక్కు వాలాడు. ఆలోచనలు గుర్రాల్లా వేగంగా పరుగెడ్తున్నాయి. అతనిలో అంతరంగ మథనం ప్రారంభమయ్యింది.

*** *** *** ***

నాది జాలిగుండె. పేదవారి బ్రతుకులు నన్ను ఆలోచింపజేస్తాయి. నా చిన్ననాటి నుండి వృధాగా పైసా ఖర్చు చేయాలన్న మనసు వప్పేది కాదు.

నేను ఖర్చు పెట్టే డబ్బు ఎందరు పేదలకు రెండు పూటల భోజనంకు ఉపయోగపడేది.

ఎందరు పేదతల్లుల చాలీచాలని గుడ్డ పేలికలకు బదులుగా మనం కాపాడగలిగేది?

ఈ విధంగా నా మనసు నన్ను వేధిస్తూ వెనక్కి లాగేది.

భూస్వామ్య వ్యవస్థలో పేరున్న కుటుంబంలో పుట్టాను. మా నాన్నగారు వేల ఎకరాలకు యజమాని. అయినా ఆయన చనిపోయిన నాడు గ్రామ ప్రజలంతా కన్నీరు ధారలుగా విలపిస్తూ సాగనంపారు. ఎవరనీ పీడించకుండా గ్రామ పెద్దగా న్యాయం, ధర్మం కాపాడాడు. కరువు రోజుల్లో తన పంటంతా పేదలకు తిండికోసం ఉచితంగా ఇవ్వటమే కాకుండా గ్రామ పెట్టుబడిదారుల నుండి సహాయం అందేలా ఏర్పాటు చేసేవాడు. తన పాలేర్లకు పండుగకు కొత్తబట్టలు ఇచ్చేవాడు. వారి ఆడపిల్లల పెళ్లికి పుస్తె మట్టెలు చేయించి దీవించేవాడు.

ఆయన రక్తం పంచుక పుట్టిన నాలో చెడుకన్నా మంచే ఎక్కువ పాళ్ళల్లో జీర్ణించుకుపోయింది.

ఇంటికి ఏకైక వారసుడిని. విలాసాలకు డబ్బుకు కొదవలేదు. అయినా నగర నాగరికత లోని ఆకర్షణలేవీ నన్ను లొంగదీయలేదు. ఉద్యోగం చెయ్యాల్సిన అవసరం లేనివాణ్ని కనుక నా చదువు ఆ దృష్టితోనే సాగింది.

నాన్నగారి తదనంతరం ఇంటి బాధ్యత తప్పలేదు.

ఆస్థిని చాలావరకు తగ్గించాను. పేదవారికే భూములమ్మాను. వారు పండించి తీర్చగలగిన నాడే డబ్బు తీసుకున్నాను. ఆనాటి రూపాయి విలువ చూసినా నేను అమ్మింది చాలా చౌకధరకే.

గ్రామాల్లో రాను రాను రాజకీయ చైతన్యం పెరగసాగింది. ప్రజలు తమ విలువ తెలుసుకోవటం మొదలైంది. ప్రజలు గంగిరెద్దులా తలలూపకుండా ఎన్నికల సమయంలో మంచి చెడులు, పార్టీల నిజాయితీ, అభ్యర్థి అన్నీ గమనంలోకి తీసుకుంటున్నారు.

నేను మొదటి నుండి రాజకీయ వాతావరణాన్ని ఏవగించుకునేవాడిని. నీతి గురించి, నిజాయితీ గురించి, పేద ప్రజల అభ్యున్నతి గురించి బహిరంగ సభల్లో బ్రహ్మాండంగా ఉపన్యసించే రాజకీయ నాయకులు నిజ జీవితంలో ఎంత నికృష్టులో తెలిసి అసహ్యం వేసేది.

విధి విచిత్రమైనది. నన్ను రాజకీయాల్లోకి నెట్టింది.

చెడ్డ పేరు లేని రాజకీయ నాయకునిగా మా గ్రామ ప్రజల సహకారమే కాకుండా పరిసర గ్రామాల ప్రజలంతా నన్ను అభిమానించారు. ఆదరించారు. మా పార్టీలోకి పెద్ద సంఖ్యలో చేరారు.

పార్టీ ఆర్గనైజరుగా వున్న రోజుల్లోనే ఆదర్శవంతంగా ప్రజల ముందు నిలబడాలని త్రాగుడు, పేకాటలాంటి వ్యసనాలను వదులుకున్నాను.

నేను చేస్తున్న సేవను గుర్తించి పంచాయితీ సమితి ఎన్నికలలో పార్టీ టికెట్‌నిచ్చారు.

ఎన్నికల ప్రచారం మొదలైంది. గ్రామ సభల్లో నన్ను నేను ప్రజల ముందు దోషిగా నిలబెట్టాను.

ఎన్నికలలో గెలిపిస్తే నా అయిదు సంవత్సరాల పదవీకాలం నీతి, నిజాయితీగా పేద ప్రజల బాగుకోసం కృషి చేస్తానని ప్రమాణం చేశాను. లంచం తీసుకోకుండా స్వచ్ఛందంగా పని చేస్తానని ప్రజలకు ప్రమాణపూర్వకమైన హామీ ఇచ్చాను.

పార్టీ పలుకుబడి, నాపై నమ్మకం రెండూ కలిసి ప్రజలు నన్ను అత్యధిక మెజార్టీతో గెలిపించారు.

ఆనాటి నుండి మానసిక వత్తిడి విపరీతంగా పెరిగింది. పెరిగినా నా వ్యక్తిగత పలుకుబడి పార్టీలో కొందరిని దూరం చేస్తే, ప్రతిపక్షం అడుగడుగునా అడ్డుకోవటం ప్రారంభించింది.

నన్ను ప్రోత్సహించిన పేద ప్రజల అండ, వారి ముఖాల్లోని ఆశ నన్ను కార్యోన్ముఖున్ని చేసేది.

ఎడారి బీడులా వున్న మా మారుమూల ప్రాంతానికి పందలాది బావులు, బోర్లు, కరెంటు మోటార్లు పేదరైతులకు అందేలా కృషి చేసాను. గ్రామాలకు పక్కా గృహాలకోసం ఒకటికి పదిసార్లు నాయకుల చుట్టూ తిరిగి అదనంగా ఇళ్ళు మంజూరయ్యేలా చూసేవాడిని. వృత్తి విద్య చేసుకునే హరిజనులకు, ఎరుకలివారికి ప్రత్యేకంగా ఋణసౌకర్యం కలిగించాను. వారి ముఖాలలోని సంతోషం నాకు వెయ్యి రెట్లు బలం ఇచ్చేది.

ఆ పేదల సహకారం, అండలేనట్లయితే ఏనాడో పదవి వదలి వెళ్ళిపోయేవాడిని.

జిల్లా కలెక్టర్ నుండి అన్ని శాఖల అధికారులు నాకు గుర్తింపునిచ్చారు. సానుభూతితో పేద ప్రజల కోసం నేను ఏ స్కీము తీసుకు వెళ్ళినా సంతోషంగా శాంక్షన్ చేశారు.

పేద ప్రజల కోసం కొంత సేవ చేయగలిగాననే తృప్తితో నా పదవీకాలాన్ని

**● ఆయన కళ్ళ వెంబడి వచ్చిన కన్నీటి వెనక అసలు కథేమిటి?**

ముగించాను.

అప్పటికే రాజకీయాల్లోని కుళ్ళు నన్ను విరక్తున్ని చేసింది. దానికితోడు ఎదిగిన నా పిల్లలు నా నిజాయితీని అపహాస్యం చేస్తు 'ఏమి సాధించావు నాన్నా?" అంటూ నిలదీయటం నన్ను మరింత కృంగదీసింది.

ఈ తరానికి చెందిన వాళ్ళ ఆలోచనలు అలా వున్నాయి. అందుకు తోడుగా మా పిల్లల కళ్ళెదుటే ఏటికాన లేని కొందరు చోటా నాయకులు పాలరాతి మేడల్లో విహరిస్తుంటే, నన్నో చేతగాని అసమర్ధునిగా లెక్కగట్టారు.

అయినా బాధపడలేదు. ఏ పేద ప్రజలకు ఎన్నికల సమయంలో వాగ్దానం చేశానో అది నిలువుకోవటానికి నిజాయితీగా కృషి చేశాను.

నా జీవితానికి ఆ తృప్తి చాలనుకున్నాను.

పదేళ్లు గడిచాయి. మా పిల్లలు వారి వారి వృత్తుల్లో స్థిరపడ్డారు.

నా శరీరం ఏనాడో నాకు ఎదురు తిరిగింది, బలవంతంగా బుజ్జగించి కూడగట్టుక వస్తున్నాను.

రాజకీయాలకు దూరంగా నేను నా భార్య జీవిస్తున్నాము. వ్యాపకం కోసం పుస్తకాలు చదవటం, చిన్న చిన్న కథలు వ్రాయటం మొదలెట్టాను. వాటిలో కొన్ని పత్రికల్లో అచ్చయ్యాయి. పెద్దగా పేరు రాకున్నా మానసిక తృప్తిని కలిగించేది.

ఓ రోజు ఉదయమే మా పెద్దబ్బాయి తల్లికి ఫోన్ చేశాడు. సిటీలోనే వున్న ఉమ్మడిగా వుండటం ఆప్యాయతలకు దూరం కావటమే అని నచ్చచెప్పి విడివిడిగా ఉంటున్నాము.

"మమ్మీ! డాడీకి వచ్చే నెలతో 60 సంవత్సరాలు పూర్తవుతాయి కదా! షష్టిపూర్తి ఉత్సవం ఘనంగా చేయాలని, నిజాయితీగల నాయకునిగా ఆయన చేసిన సేవకు గర్విస్తూ, అన్నీ పార్టీల వారిని ఆహ్వానిస్తాను. డాడీకి పరిచయస్థులనూ, అభిమానులనూ ఆహ్వానించి ఆయన కొడుకుగా నా పేరు నిలువుకుంటాను. తమ్ముడు 15 రోజుల ముందు వస్తానన్నాడు. ఈరోజే యస్.టి.డి.లో మాట్లాడాను. ఈ విషయంలో నీ కోడలే పట్టుదలగా వుంది ఘనంగా జరపాలని"


ముఖం సంతోషంతో వెలిగిపోగా శ్రీమతి ఈ వార్త నా చెవిన వేసింది. నవ్వి వూరుకున్నాను.

ఉదయం తొమ్మిది గంటల ప్రాంతంలో ఇంటి ముందు వాలు కుర్చీలో కూర్చుని చల్లని గాలి ఆస్వాదిస్తున్న నేను ఓ నలుగురు యువకులు గేటు తీసుకుని లోపలికి రావటం గమనించాను.

ఏ చందాకోసమో వచ్చిన వాళ్ళను కుంటూ ప్రశ్నార్ధకంగా చూశాను వాళ్ళవైపు.

"నమస్కారమయ్యా!" అన్నారు.

"అయ్యా!" అన్నారంటే వాళ్ళు మా ప్రాంతం నుంచి వచ్చారని అర్ధమైంది.



"ఏం బాబు ఏ వూరి నుండి వచ్చారు" అని అడిగా ఆప్యాయంగా.

"సింగారం నుండి. నేను గద్దల సోమయ్య కొడుకు చంద్రాన్ని" అన్నాడు అందులో ఒక అబ్బాయి.

నాకు సన్నిహితుడైన సోమయ్య పేరు చెప్పగానే ఆ అబ్బాయంటె అభిమానం పెరిగింది. వారందరినీ కూర్చోమని చెప్పాను.

"ఏం చదివావు? ఇప్పుడేం చేస్తున్నావు?" అన్నాను ఆ అబ్బాయిని.

"ఐ.ఏ.యస్. ప్యాసయ్యాను. ట్రైనింగు పూర్తయ్యింది. ఇప్పుడు రాజమండ్రిలో ప్రొబేషనర్‌గా వున్నాను" అన్నాడు చంద్రం.

నా కొడుకే ఆ స్థితిలో కనబడినంత ఆనందంతో వణుకుతూ లేచిన నేను కుర్చున్న ఆ అబ్బాయిని లేపి కావలించుకున్నాను.

నా కళ్ళలో ఆనంద బాష్పాలు.

"ఏం బాబూ! ఈ ముసలాయన ఎట్లా జ్ఞాపకం వచ్చాడు" అని అడిగాను అతని రెండు భుజాల పై చేతులుంచి.

"అట్లా అనకండయ్యా! మీ పెద్ద మనసు గురించి మా నాయన ఎప్పుడూ చెప్తుంటాడు. మా పేద బ్రతుకులు బాగుపడటానికి ఏటి ప్రాంతమైన మా గ్రామాలలో చేతిబోర్లు మోటార్లు మంజూరి చేయించి పేద హరిజనులు గౌరవంగా తమ కాళ్ళ మీద తాము నిలబడ గలిగేలా చేశారు. నన్ను బాగా చదివించమని మా నాన్నను ప్రోత్సహించారు. క్రమక్రమంగా మెరుగుపడ్తున్న మా ఆర్థిక పరిస్థితికి కారకులెవరో తెలుసుకోగల విజ్ఞత నన్ను మిమ్మల్ని ఆరాధించేలా చేసింది. మీ ప్రోత్సాహం నాలో పట్టుదలను పెంచింది. నా ఈ స్థితికి మీరే కారకులు" అన్నాడు ఎంతో అభిమానంగా.

నా గుండెల్లో ఆర్ద్రత. మాటలు రావటం లేదు.

"సంతోషం" అంటూ కూర్చున్నాను.

చంద్రం నావైపు సంకోచంగా చూస్తూ "మీరు మాకో సహాయం చేయాలి" అన్నాడు.

"చెప్పు బాబు! ఈ వయస్సులో అన్ని వ్యాపకాలు వదులుకున్న నేను నీకే సహాయం చేయగలను? నా నుంచి జరిగే పనైతే తప్పక చేస్తాను" అన్నాను.

"మీ కొడుకులాంటి వాడిని. మాటి వ్వారు. తప్పరుగా" అన్నాడు చంద్రం.

"తప్పను" అన్నట్లు నవ్వుతూ తలవూపాను.

"ఈ సంవత్సరం అంబేద్కర్ జయంతి సందర్భంగా నన్ను సన్మానించాలని యువకులు పట్టుపట్టారు. సర్పంచ్‌గారితో "పేదల కోసం పాటుబడిన రాజారావుగారిని సన్మానిస్తానంటే నేను అంగీకరిస్తాను" అన్నాను. సర్పంచ్‌గారు 'అనారోగ్యంతో వున్న రాజారావుగారు రావటానికి అంగీకరిస్తారన్న నమ్మకం నాకులేదు. మీరు వారిని తీసుక రాగలిగితే ఘనంగా సన్మానం ఏర్పాట్లు నేను చేస్తాను" అన్నాడు. సర్పంచ్ ఎవరో కాదు, మీరు అధ్యక్షులుగా ఉన్న నాటి నుండి నేటివరకు సైమన్ రెడ్డిగారె ఎన్నికవుతున్నారు" అన్నాడు చంద్రం.

అంతటితో ఆగకుండా "ఇంటింటా వెలుగులు నింపిన మిమ్ముల చూడాలని మన ప్రాంతం వారంతా ఆశపడ్తున్నారు. మీ ఆరోగ్యం సరిగా లేదని మాకు తెలుసు. ఈ ఒక్కసారి మా కోర్కె తీర్చండి" అన్నాడు.

"బాబూ! నా సన్మానం కోసం కాదు, నిన్ను నేను సన్మానించటానికి వస్తాను" అన్నాను చంద్రం వైపు ప్రేమగా చూస్తూ.

ఆ యువకుల ముఖాలు సంతోషంతో వెలిగిపోయాయి. టీ సేవించి సెలవు తీసుకుని వెళ్ళిపోయారు.

దూర ప్రయాణం శరీరం భరించలేదు. అయినా వెళ్ళాలని దృఢంగా నిర్ణయించుకున్నాను...

గతమంతా నెమరేసుకున్న రాజారావు నెమ్మదిగా కండ్లు తెరిచి చూశాడు. కారు భోనగిరి చేరింది. ఇంకా రెండు గంటలు ప్రయాణం. చేతిలోని పత్రిక తిరగేస్తూ కాలక్షేపం చేశాడు.

సాయంకాలం ఆరుగంటల్లకు కారు సింగారం చేరుకుంది. ఎందరినో సన్మానించి, ఎన్నో సన్మానాలు చూసిన రాజారావు ఆ ప్రజల ఆనందాన్ని చూసి పరవశించాడు. నిజమైన ఆప్యాయత దూరమైన వారి బంధువును చూస్తున్న అనుభూతి వారి ముఖాల్లో స్పష్టంగా కనిపించింది.

పరిసర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. తమ గుండెలలోని ప్రేమను దండలలోని పూవులుగా మార్చి ప్రకటించుకున్నారు. ఊరేగింపుగా అందరూ స్టేజి వద్దకు చేరారు.

ముఖ్యులందరూ స్టేజి మీద ఆసీనులైనారు. మాట్లాడిన ప్రతివ్యక్తీ రాజారావుగారు పేదల సంక్షేమం కోసం చేపట్టిన కార్యక్రమాల గురించి, కొన్ని సంవత్సరాల అనంతరం వారిని చూసిన ఆనందం తమ మాటల్లో వ్యక్తం చేశారు.

మారుమూల గ్రామంలో పేద కుటుంబంలో పుట్టి స్వయంకృషితో అత్యున్నతమైన చదువు సాధించి చంద్రం తమకందరికీ గర్వ కారణమయ్యాడని ప్రశంసించారు.

చంద్రం మాట్లాడుతూ "నా ఉద్యోగం నాకు నా కుటుంబానికి పరిమితం కాదు, మీలో ఒకనిగా మీ అందరిదీ, మీరంతా గర్వంగా చంద్రం మావాడు, నీతి నిజాయితీతో పేదలకోసం సమాజం కోసం తన పదవిని సద్వినియోగం చేస్తున్నాడు అని గర్వపడేలా నా బాధ్యత నిర్వహిస్తాను.

పెద్దలు రాజారావుగారి గురించి మీరు అన్ని విషయాలు మాట్లాడారు. నాకు వ్యక్తిగతంగా నా ఉన్నతికి స్ఫూర్తినిచ్చిన మహా వ్యక్తి. నా విధి నిర్వహణలో వారి వ్యక్తిత్వం మార్గదర్శకమవుతుందని గర్వంగా ప్రకటిస్తున్నాను.

పేదల గుండెల్లో వారు చిరంజీవి. వారికి నచ్చే ఈ చిన్ని కానుక స్వీకరించాలని మనవి చేస్తున్నాను" అంటూ చంద్రం స్టేజి మీద తన సమీపంలోనే ప్యాకు చేయబడిన వస్తువును చేతిలోకి తీసుకున్నాడు.

ప్యాకేజి విప్పగా అందులో లామినేషన్


భార్యలు, భర్తల్ని ప్రేమించినట్టుగా భర్తలు, భార్యల్ని నిజంగా ప్రేమిస్తారా?

చదవండి

రెండు దశాబ్దాల క్రితమే భార్యాభర్తల సంబంధాల్లోని సున్నితత్వాన్ని తన రచనల ద్వార ప్రకటించి, సంచలనం సృష్టించిన ప్రఖ్యాత మలయాళ రచయిత్రి



కమలాదాస్

జీవితకథ

మై స్టోరీ

తెలుగు అనువాదం

అతి త్వరలో...

చేసిన పేయింటింగు వుంది. కుచేలుడు అటుకుల మూట విప్పి శ్రీ కృష్ణుని ముందుకు చాచి నిలబడ్డాడు. కృష్ణుడు ఆనందంగా అటుకులు చేతిలోకి తీసుకుంటున్నాడు.

రాజారావు నెమ్మదిగా లేచి ఆ పెయింటింగు అందుకున్నాడు. చంద్రం అభిమానం, అంతరంగం ఆ పేయింటింగులో స్పష్టం కాగా, ఆ పేయింటింగ్ చంద్రం స్వయంగా వేశాడని తెలిసి పులకించిపోయాడు.

రాజారావును సర్పంచ్ సైమన్‌రెడ్డి "చిరకాలం తామంతా స్ఫూర్తి పొందేలా మీ సందేశం ఇవ్వండి" అని కోరాడు.

రాజారావు వణికే గొంతును స్వాధీనం లోకి తెచ్చుకుంటూ "మిత్రులారా! ఒంటరి జీవితం గడుపుతూ విశ్రాంతి తీసుకుంటున్న నన్ను మీరు మీ గుండెల తలుపులు తీసి ఆహ్వానించారు. ఈ క్షణాన భగవంతున్ని ఏమని ప్రార్థిస్తున్నానో చెప్పనా? భగవాన్! నన్ను ఓ20 సంవత్సరాలు వెనక్కి పంపు. నాకు సంపూర్ణ ఆరోగ్యం ఇవ్వు. నా మిత్రులందరితో కలిసి సమాజ సేవలో సార్థకత చెందే భాగ్యం కలుగజేయాలని ప్రార్థిస్తాను.

గతంలో భగవంతుడు నాకు అవకాశమిచ్చాడు. మిమ్మలందర్నీ నా వాళ్ళుగా పొందగలిగాను. చీకటిలో కొన్ని చిరుదివ్వెలు వెలుగించగలిగాను. నేను నాటిన చిన్నారి మొక్కలు మహావృక్షాలయ్యాయి.

మన మనస్సుల మధ్య తెగిపోని వారధి కట్టుకున్నాము.


మీ నుండి నేను ఎంత దూరంలో వున్నా మీ మనస్సులలోని ప్రేమ అనే సిగ్నల్ ఇవ్వగానే నా మనసు నా బలహీనమైన శరీరాన్ని వెంటనే శాసించింది. లే తయారవ్వు, మానవత్వం వున్న మనుషుల మనస్సులన్నీ ఒక చోట సమావేశమవుతున్నాయి. నేను వారిలో ఒకన్ని. వెళ్ళక తప్పదు. నా వెంట నీవు రాక తప్పదు.

నా గత స్మృతులను, నేటి అనుభవాన్ని నెమరేసుకుంటూ నా భావి జీవితాన్ని తృప్తిగా గడిపేస్తాను.

ముగించేముందు చిన్న వినతి. యువత తమ భవితను మరచి తాత్కాలిక ప్రలోభాలకు బానిస అవుతున్న ఈ రోజుల్లో ఓ మారుమూల గ్రామములో బలహీన వర్గానికి చెందిన కుటుంబంలో జన్మించిన చంద్రం అత్యున్నత విద్య,త అదీ సమాజాన్ని నిర్దేశించే విద్య నేర్చుకోవటం నాకీనాడు గర్వంగా వుంది. నేను శ్రమతో ఈ కార్యక్రమానికి రావటంలో ముఖ్య కారణం చంద్రం. చంద్రం నగరానికి వచ్చిన నాడు నాతో మీరు నా తండ్రిలాంటివారు అన్నాడు. నా కొడుకులాంటి చంద్రానికి సదా గుర్తుండేలా అతని విధి నిర్వహణలో స్ఫూర్తిదాయకమైన బహుమతితో సన్మానిస్తున్నాను" అంటూ కారు డ్రైవర్ కోసం చూపు మళ్లించాడు.

స్టేజి దగ్గరే నిలబడి వున్న డ్రైవర్ చేతుల్లో బరువైన వస్తువు దాదాపు రెండు అడుగుల ఎత్తులో ప్యాకు చేయబడివుంది. డ్రైవర్ వెంటనే చేతిలోని వస్తువుతో స్టేజిపైకి వచ్చాడు. క్షణాల్లో ప్యాకేజీని తప్పించాడు. తెల్లటి పాలరాతి విగ్రహం.

సమాజానికి మార్గం నిర్దేశిస్తున్నట్లుగా కుడిచేతి చూపుడు వేలును పైకిసాచి నిలబడిన




"ఇంటర్నేషనల్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్" అన్న బిరుదుని ప్రఖ్యాత వెస్టిండీస్ క్రికెట్ వీరుడు 'లారా'కి ఇచ్చారు. తనకి ఇచ్చిన కప్పుని చూసి 'లారా' తెగ మురిసిపోయి దాన్ని డిజైన్ చేసిన 'నీతాభోస్లే'ని మనసారా అభినందించాడట. టైటన్ కంపెనీ యొక్క ఖరీదైన వాచీ 'కనిష్క' డిజైన్ కూడా నీతాభోస్లేయే చేసిందట.

- వసంతకుమార్ సూరిశెట్టి.

డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కన్నుల పండువుగా కనిపించగానే యువకులంతా ఆనందంగా కేకలు వేశారు. చంద్రం ముఖం కోటి వెన్నెలల కూటమిగా మారింది.

వినయంగా అభివాదం చేసి ఆ బహుమతిని ప్రాణప్రదమైన వస్తువులా జాగ్రత్తగా రాజారావు నుండి అందుకున్నాడు చంద్రం.

రాజారావు మనసు తృప్తిగా నిశ్వసించింది. సభ ముగించారు. చంద్రం రాజారావును సమీపించి "మీరు మా యువతకోసం మరికొన్త శ్రమ పడక తప్పదు. ఇక్కడికి సమీపంలో అంబేద్కర్ కమ్యూనిటీహాలు పక్కన చిన్న లైబ్రరీ గది నిర్మించుకున్నాము. మీరు అది ప్రారంభించాలి" అన్నాడు.

రాజారావు చిరునవ్వుతో చంద్రాన్ని అనుసరించాడు. వారితో పాటు అంతా కదిలారు.

తాను శాంక్షన్ చేయించి ప్రారంభించిన కమ్యూనిటీ హాలు చూడగానే రాజారావు తృప్తిగా తనలో తాను నవ్వుకున్నాడు.

హాలు పక్కన కట్టిన కొత్త కట్టం చూడగానే రాజారావుకు ఆశ్చర్యం, ఆనందం రెండూ కలిగాయి.

"రాజారావు విద్యామందిరం" అని పెద్ద అక్షరాలతో రాసి వుంది.

ఆనాడు వయోజన విద్య గురించి చేసిన కృషి చంద్రం తండ్రి సోమయ్యను అక్షరాస్యున్ని చేయాలన్న తపనకు చందం తనకు ఇచ్చిన గుర్తింపా? అని రాజారావు మనసులో అనుకున్నాడు.

"రండి రిబ్బన్ కట్ చేయండి" అంటూ సర్పంచ్ సైమన్‌రెడ్డి ఆహ్వానించాడు. చంద్రం కత్తెర చేతికిచ్చాడు.

వణికే చేతుల్లోకి శక్తిని నింపుకుంటూ రిబ్బన్ కట్ చేశాడు ముఖ్యులతో హాలులోకి ప్రవేశించాడు.

గోడలకు అమర్చిన టేక్‌వుడ్ షెల్ఫులలో విజ్ఞానదాయకమైన పుస్తకాలు నీటుగా అమర్చివున్నాయి.

"శ్రీ రాజారావుగారు" అని రాసివున్న ఓ షెల్ఫులో ఆయన వివిధ పత్రికలలో రాసిన కథలు, వ్యాసాలు సేకరించారు.

గది నలుమూలల చూస్తూ ఎదురుగా పక్క పక్కనే వున్న రెండు పెద్ద ఫోటోలను, వాటి కింద పొందికగా రాసివున్న వాక్యాలను చూడగానే రాజారావు బలహీనమైన గుండె వేగంగా కొట్టుకోసాగింది.

ఒక ఫోటో బాబాసాహెబ్ అంబేద్కర్‌ది. ఫోటోల కింద "జాతిని జాగృతం చేసిన వ్యక్తికి జోహార్లు" అని రాసి వుంది.

రెండో ఫోటో రాజారావుది.

"మా హృదయాల్లో సదా వుండే ఆత్మ బంధువు" అని రాశారు.

రాజారావు 'చంద్రం' అని పిలిచి "బాబు ఆ మహనీయుని పక్కన గౌరవం పొందగల స్థాయి నాకు లేదు నాయనా" అంటూ కౌగలించుకున్నాడు.

రాజారావు కళ్ళ వెంట ధారాపాతంగా కన్నీరు ప్రవహిస్తోంది.

ఆ కన్నీటితో చంద్రం భుజం తడిసిపోయింది. ●